కథానిక

# అపరిమిత కుటుంబం

"పరంధామయ్య"

మాధవరావు తన పిత్రార్జితమైన పెంకుటింటి ముందు గదిలో కుర్చీలో పడుకొని పై కప్పువైపు దృష్టి సారించాడు. అక్కడక్కడ పెంకులు జారిపోయిన వేమో- వెలుగు రేఖలు ద్వారాలపైని చిమ్మచీకటిని భేదించుకుంటూ దట్టంగా వున్న బూజులోకి జొరబడి వస్తున్నయ్. పెండీలు-వాసాలు మొదలైన ఆ ప్రాచీన భవంతియొక్క వస్తుజాలమంతా నల్లగా తారు పూసినట్టు పొగ చూరిపోయింది. ఉప్పూరిసి గోడల గచ్చు అంతా, రాలిపోయాయి. కొన్ని గచ్చు పళ్లెలు తమ స్వస్థానాన్ని వీడి వచ్చి మధ్యవున్న బూజులోపడి కింద పడకుండా త్రిశంకుస్వర్గం అనుభవిస్తూ వున్నయ్. ఆ యింటికి అట్టే కిటికీలు లేకపోయినా- వున్న రెండు కిటికీలు తలుపుబందు లూడిపోయి- కమ్ములువదలి- వీధిలోని దుమ్మును నిరాటంకంగా లోపలికి ప్రవేశపెడుతున్నయ్. ఇంటి ముందు యిరుకైన పంచ. అదైనా పడిపోయేందుకు సిద్ధంగా వుంది ఆ పంచ కిందనే నిరంతరం ప్రవహించే మురికి కాలువ మునిసిపాలిటి ఘనతను యినుమడింపజేస్తూ నిశ్శబ్దంగా పారుతూ వుంటుంది.

"ఇలాగా వుంటే కూలిపోతుంది ఎప్పుడో" అని గొణిగాడు మాధవరావు.

"పిల్లలుగల యిల్లు-ఎంత ప్రమాదం" అతని ముఖంలో భయం కనబడింది. కాని గత నాలుగేండ్లనుండి అతనిలాగే అనుకుంటున్నాడు. కాని ఎప్పటికప్పుడు ఏదో ఒక అడ్డంకువచ్చి నిలిచిపోతూ వుండేది. ఈ యేటికి మరామత్తు సాగాలి అని తోచినపుడు ఆ యింటి బూజు దుమ్ము దులపటానికి తానే స్వయంగా నడుంకట్టేవాడు. ఎంత దులిపినా- అక్షయంమాదిరి మరునాటికల్లా యథాప్రకారం వుండేది. ఆఖరుకు విసిగి దులపటం మానేశాడు. పై కప్పు మార్చి-గోడలకు గచ్చు వేయించే వుపయోగం లేదని తోచిందతనికి.

"ఈ యేడు తప్పక మరామత్తు కావలసిందే" కాని అతనికో సందేహం——యిదివరకు కొంత మరామత్తు అనుకున్నప్పుడల్లా ఏ అడ్డంకులొచ్చాయో-అవే యిప్పుడొస్తే? వస్తే రావచ్చు కూడా మాధవరావు బిత్తరపోయాడు. ఇంటి మరామత్తు అనుకున్నడల్లా భార్య కాన్పుకి తయారయ్యేది. ఇంటిని తాకట్టుపెట్టి డబ్బు తెచ్చేవాడు. తర్వాత కొద్ది రోజులకి హాస్పిటలునుండి భార్యతోటే మరొక ప్రాణి యింటిలోకి దిగుమతి కావటం, షావుకారు దగ్గర అప్పుతెచ్చిన డబ్బుబాపతు పైసా మిగలకుండా ఖర్చు కావటమూ జరిగేది. ఆ అప్పుమొత్తం మరల కాన్పు వచ్చిందాకా నానాయాతనపడి తీర్చుకోవడము జరుగుతూ వుంది

పుట్టింటివారు ఎంత లేనివారైనా అక్కడే పురుడు పోసుకొని రావటం ఆచారం కాని మాధవరావు దూరదృష్టిలేక-పిల్లిమూర్ఖంవల్ల మొదటికాన్పుకి పుట్టింటివారు ఎంత ప్రాధేయపడ్డా భార్యను పంపలేదు వారిది పల్లెటూరు అని, ఏదైనా ఉపద్రవం వస్తే ఆదుకోటానికి కనీసం మంత్రసానైనా లేదని-అందువల్ల పంపనని చెపుతూ వారినే వచ్చి ఆ నాలుగురోజులు యిక్కడ వుండమని కోరాడు. పాపం! ఇంత మితిమీరిన కాన్పులని అతనికేం తెలుసు? ఇప్పటికే ముగ్గురు కూతుళ్లు, యిద్దరు కొడుకులు, ఆ చుట్టుపక్కల పిల్లలుగల యిల్లు మాధవరావు గారిదేనని పేరుపడేట్టు చేశారు ఈ సంతానం యిట్లా అభివృద్ధిచెందుతూ పోతే చదువు సంధ్యలు యెట్లున్నా, వారికి తన తాహతుకు తగినట్లు గుడ్డలు కొనాలన్నా తలకుమించిన బరువై కూర్చుంది. పాపం, పరిమిత కుటుంబాల ఆదర్శాన్ని మనసులో వుంచుకొని డాక్టర్ స్టోన్ గారి సలహాను కూడా అతడు అక్షరాలా పాటించాడు. కాని, విధి వైపరీత్యం, యీ మధ్య తన భార్య డోకులు చేసుకోటం, బూడిద కచికలకోసం తారట్లాడ

టం చూస్తే మరలా ఒక బిడ్డకు తండ్రయ్యే ఘోర ప్రమాదం తనకు పట్టినట్లేనని అతడు భయపడసాగాడు. ఇంతలో పక్కింటి గోడ గడియారం గంట కొట్టడం ప్రారంభించింది. తొమ్మిది మాధవరావు కుర్చీలోంచి ఎగిరిపడి దండానవుంచిన రుమాలు అంగుళాని దొడ్లోకి పరుగెత్తాడు భార్యని కేకవేస్తూ- "లై మయిపోయింది వంటకానీ, ఇంతలో స్నానం చేసివస్తా—"

"అప్పుడే తొమ్మిదయిందా? ఇప్పుడేపిల్లల్ని బడికి పంపి పొయ్యిమీద పప్పువేశా — వుడికి వుంటుంది. కూర తరిగాను. ఈరోజు ఆలస్యం అయిపోయిందే?"

"కానిదెప్పుడు—"

"యీ పిల్లల్ని సర్ది పంపించేటప్పటికి నా నట్ట కూలిపోతుంది."

"అదేమంటే పిల్లలు-కొంపలో ఏది అవక తవకైనా పిల్లలే—"

"వాళ్లనొక్క నిమిషం సముదాయించండి- మీకే తెలుస్తుంది"

"అదొకటి మరలా, వున్న వాటితో సత మత మవుతుంటే?"

"అటు చూడండి. చిన్నపిల్లదో గాడుతూ ఎక్కడికెళ్ళిందో"

"చూచినట్టేవుంది. యీ నీటినిండా దుమ్ము."

"ఎవరికైనా మనపిల్లలు అలా ముద్దొస్తారు కదా. మీ రెందుకండీ అలా విసుక్కుంటారు?"

"ఒకరా యిద్దరా ఒకపటాలాన్ని వుత్పత్తి చేస్తివి."

"ఏమన్నారూ ?" కమలమ్మ నివ్వెరపోయింది. "మన బిడ్డలే మనకు బరువయ్యారా" ఆ తల్లి హృదయం కుమిలిపోయింది.

"బరువుకాక ఏముంది కమలా! కనీసం మనం గడిపే జీవితాన్నైనా వాళ్ళు గడిపే ఏర్పాటు చేయగలమనే ధైర్యం నీకుందా? మనం కనిపెంచిన బిడ్డలు చదువులేని మూర్ఖులై చీలికలు పేలికలు కట్టుకొని వీధుల్లో తిరుగుతుంటే మనకెట్లా వుంటుంది?"

"అలాగని అనరాని మాటలన్నీ అంటారా?"

"ఏమన్నాను- ఇంత చాకిరి చేస్తున్నా ఇంత చదువు చదివి వుద్యోగం వెలగ బెడుతున్నా- బిడ్డల్ని సరిగా పెంచలేక పొయ్యామే అని బాధ తప్ప వాళ్ళపై కోపంతో అన్నాననా నీ వుద్దేశం"

"మీ పిచ్చిగాని పుట్టించినవాడు పోషించ లేక పోతాడటండి."

"అదీ ఒక బతుకేనా, ఏలాగో బతకటం."

"పోనీలెండి మీకంత భారంగావుంటే .. స్నానం కానీండి పొయ్యికూడా చల్లారి నట్టుంది"

మాధవరావు ఆరోజు ఆఫీసునుండి బయట పడి ఎకాఎకాను తెగిపోయిన చెప్పులను యీడ్చుకుంటూ తన మిత్రుడైన డాక్టరు బ్రహ్మానందంగారి దగ్గర కెళ్ళాడు. రోగులు వరండాలోని బెంచీలపై క్రిక్కిరిసి కూర్చొని వున్నారు అక్కడికి పోగానే మాధవరావుకి మందులవాసన ఘాటుగా వేసింది.

"డాక్టరుగారు వున్నారా?"

"వున్నారు—"

"లోపలింకెవరన్నా వున్నారా?"

"రాయలసీమ కరువుకు డబ్బు దండేవాళ్లు వచ్చి బాతాఖానీ కొడుతూ కూర్చొన్నారు. వాళ్లకింతకన్న మంచిటైము దొరకదేమో" ఒక స్టూడెంటు కాలరు సర్దుకుంటూ కోపంతో అన్నాడు. మాధవరావు ఒక బెంచీ అంచుని స్టూడెంట్కు దగ్గర కూర్చున్నాడు. కాఫీగ్లాసులు లోపలికి పోతున్నై. "కాఫీ సేవిస్తేగాని- యీ పిశాచాలు వదలవు" ఆ స్టూడెంటే మరలా అన్నాడు ఇంతలో యిదరెవరో వచ్చి డాక్టరుగారి గది తలుపు తెరవబోయారు.

"లోపలెవరో మాట్లాడుతున్నారయ్యా—" తలుపు దగ్గరేవున్న ఒక వృద్ధుడు కీచుగొంతుకతో అన్నాడు.

"ఓహో! అట్లనా." వారిద్దరు ఆ వృద్ధునిపై ఒక చిరునవ్వు పారేసి తలుపుతోసుకుని లోపల జొరబడ్డారు.

"అనాథ శరణాలయం తాలూకు మనుషులు వారి ప్రవేశానికి యిక్కడ నిషేధంలేదు." బట్టతల తడుముకుంటూ అయిదువేళ్ళకూ ఉంగరాలు పెట్టుకున్న ఒక ఆసామి అన్నాడు.

"సోషల్ సర్వీస్ అంటే డాక్టరుగారికి బలే యిష్టం." ఒక కళ్ళద్దాల మనిషి సిగరెట్టు

పొగ వదులుతూ స్టూడెంటు వైపు చూస్తూ అన్నాడు.

"అంతా హంబక్. తనకోసం యింతమంది యెంతో దూరాన్నుండి వచ్చిపడి, యిక్కడ నానా యాతనా పడుతూంటే వాళ్ళకర్మానికి వాళ్ళని వొదిలి యీాయన సాధించే సోషల్ సర్వీసు అంతా హంబక్."

డాక్టరు గదితలుపు హఠాత్తుగా తెరవబడటంతో స్టూడెంటు తన వాక్ప్రవాహాన్ని టక్కున ఆపేశాడు. ఒకబక్క పల్చటి ఎర్రటి కుర్రాడు వచ్చి—"డాక్టరుగారితో పనుంటేనా మీదంతా వచ్చింది?"

అందరూ అవునవునని అన్నారు. స్టూడెంటు మాత్రం—"లేక భాగోతం చూడటానికి వచ్చామనుకున్నావా" అని వెటకారంగా అన్నాడు.

"ఎక్స్క్యూజ్ మి. ఇక్కడ బసచేసిన రోగుల చూచేందుకు వచ్చినవాళ్ళు యిక్కడ విశ్రాంతి తీసుకోటం అలవాటు. దానికని అడగాల్సి వచ్చింది." అంటూ మాధవరావుని చూశాడు. "మీరు కూడా డాక్టరుగారితో మాట్లాడాల్నా" మాధవరావు లేచి "యిందాకటి నుండి ఆయనకోసమే కూచున్నా. వారితో నే నొచ్చానని చెప్పు."

"వారితో చెప్పి మిమ్మల్ని పిలుస్తాను" అంటూ లోపలి కెళ్లాడు.

"మహాశయా మీరుకూడా ఒక దీనజన బాంధవులా యేం" కళ్ళద్దాలమనిషి అడిగాడు.

"లేదండి. దీనజనుణ్ణి మాత్రమే"

"అలా అయితే రక్షించబడ్డాం" స్టూడెంటు వ్యంగ్యంగా అన్నాడు.

"ఎందుకని—"

"త్వరలో నిష్క్రమిస్తారు గాబట్టి"

"ఎందుకండీ మీకీ దీనజన శ్రేయోభిలాషులపై అంతకోపం."

"అబ్బే! లేనేలేదు తామేదో ఘనకార్యం చేస్తున్నామని తమడ్యూటీ మరచిపోయి యితరులను నానా హింసలు పెట్టే వారిపై ఎవరికైనా మంట వుండదూ?"

ఇంతలో మాధవరావుగారికి పిలుపువచ్చింది. రాయలసీమ కరువు సమాజం అనాథశరణాలయంవారి తాలూకు బూట్లు మెట్లమీద టకటకలాడి వీధిలోకి వెళ్ళిపోయినై

"రాండి అలా కూర్చోండి"

"మీతో ఒక విషయం మాట్లాడాలని వచ్చాను."

"కానీండి. బయట నాకోసం చాలామంది వున్నట్టున్నారు. ఈమధ్య బొత్తిగా టైమ్ చాలటంలేదు."

"నాభార్య మరలా గర్భిణి."

"పరీక్ష చేయిస్తారా."

"లేదు లేదు ఇప్పటికే అయిదుగురు బిడ్డలు. నా సంపాదనతో వాళ్ళను పోషించినప్పటికే తల ప్రాణం తోకకు వస్తోంది. మరలా మూర్గే నక్కపై తాటికాయ పడ్డట్టు కాన్పు. ఖర్చులు ఎంతలేదన్నా వంద కావాలి. ఏదన్నా సదుపాయం."

"ఉచితంగా వైద్య సదుపాయం లభించేట్టు చూస్తాను. ఎన్ని నెల్లు?"

"రెండు నెల్లు."

"ఇంతేనా!"

"కాని నా వుద్దేశం వేరు. ఈ సంపాదనతో వీరిని పోషించటం, తగిన విద్యావసతులు కలిగించటం సాధ్యమయ్యే పనేనా? ఇప్పటికి వున్నవాళ్ళే చాలు."

"అవును ఇప్పుడు నన్నేమి చేయమంటారు?"

"ఏదైనా సదుపాయం, మరలా కాన్పుకి వందరూపాయలు కావాలి ఇల్లుచూస్తే పడే స్థితిలోవుంది దాన్ని రిపేరు చేయించాలంటే—"

"మీ వుద్దేశం తెలుస్తూనే వుంది. కాని మీరు పొరబాటు పడుతున్నారు ఇప్పుడు మన దేశం స్వతంత్రమైంది ప్రతివాళ్ళూ ఏదో ఒక విధంగా త్యాగం చెయ్యకపోతే మనంముందుకు పోలేం. అంతర్జాతీయంగా మనదేశం ప్రాముఖ్యం చెందిందంటే విశేషమైన దాని జనాభా వల్లనే అని నా అభిప్రాయం మీకే సహాయమైనా చేయగలను గాని నా అంతరాత్మకు వ్యతిరేకంగా యీ పని చేయను. మీకలా చేయమని కూడా సలహా చెప్పను స్వతంత్రమైన మన దేశం యింక కొద్దికాలంలోనే అనేక మార్పులు తీసుకొచ్చి మీస్థితి బాగుపరచవచ్చు. కంగారు పడకండి."

"నాకుకూడా ఆపని చేయటం మనస్కరించలేదు. మిమ్మల్ని సలహా తీసుకొని కానియికనన్నా గర్భం ఏర్పడకుండా వుండే సహాయం ఆపరేషన్ సూదులు"

"సూదులు మందులు వుపయోగం లేదు. ఆపరేషన్—అది ఆడవాళ్ళకు చాలా ప్రమాదం. మగవాళ్ళకు సులభమే గాని—నమ్మటానికి వీలు లేదు వెఘవడి ఆశా లేనిపోని మెంటల్ వర్రీ"

"ఎందువల్ల అలా జరుగుతుంది"

"మీకే ఆపరేషన్ చేశామనుకోండి. అది ఫెయిల్ అవుతుందనికూడా అనుకుందాం అప్పుడు మీ భార్యకు గర్భం రావచ్చు. మీకు లేనిపోని అనుమానాలు—ఏమంటారు"

"అలా ఎందుకని ఫెయిల్ అవుతుంది"

"అన్నీ ఫెయిల్ కావు. కాని కొంత పెరసంట్ ఫెయిల్ గావటం స్వాభావికం ఆ పర్టికులర్ పెరసెంట్ లోనే మీరొకరైతే—అందువల్ల యీ కృత్రిమమయిన వాటిలో బజారురకం దానికంటె—నిగ్రహం మంచిది. కాని అదికూడా సేఫ్ కాదు." మాధవరావు నిరుత్తరుడయ్యాడు.

"పరిస్థితులు అర్థంచేసుకొని ఎలాగో మొగవాడు నిగ్రహం పాటించినా——ఒక్కొక్కసారి యింట్లో ఆవిడకు గంగవెర్రులెత్తి మోహావేశంతో అవినీతిపనులకు పరుగెత్తవచ్చు—మీ విషయం కాదు. కీడెంచి మేలెంచమన్నారు."

డాక్టరు యింకేదో చెప్పడానికి వుపక్రమించేలోగా మాధవరావు సెలవుతీసుకొనే వుద్దేశంతో లేచి నమస్కారంచేసి భారమైన హృదయంలో వీధిలోకి వచ్చేశాడు.

కొన్ని నెలల తర్వాత ఒకనాటి సాయంత్రం మాధవరావు యింటికి చేరేటప్పటికి అతని అత్తగారు వచ్చివుంది ఆ రాత్రే అతని భార్యకు నొప్పులు కనబడినై. మరునాడు ఆఫీసుకు శెలవు బెట్టి మాధవరావు ధన సేకరణలో మునిగిపోయ్యాడు. నాలుగు నెలలనాడు విడిపించుకొన్న యింటిని మరలా తాకట్టు పెట్టి వంద రూపాయలు తెచ్చాడు. భార్యను హాస్పిటల్ లో చేర్చి-అత్తగారిని తోడుంచి వచ్చాడు. రాత్రికి పిల్లలకు పక్కలు వేసేపని అతనిపై బడింది. ఇంటియొక్క ఉత్తరవైపు కురుమాడి యొక్క బిగువు శిథిలమై పెంకులకప్పు భారాన్ని మోయలేక విరిగిపోయింది. పైకప్పుకూడా ఆ బిగువునే అనుసరిస్తూ దోనెమాదిరివంగిపోయింది. ఆ అపాయాన్ని కనిపెట్టిన మాధవరావు పిల్లల పక్కలను వుత్తర వైపునుండి దక్షిణ వైపుకు మార్చాడు. అక్కడున్న పడక కుర్చీని మడచి దూలంపై భద్రపరచాడు. తన విశ్రాంతి కాలాన్ని పడకకుర్చీలో గడిపే అవకాశాన్ని త్యాగంచేస్తూ-ఇదొక్కటేగాదు, పిల్లలకోసం ముందు ముందు మాధవరావునుండి ఎన్ని త్యాగాలు కోరబడతవో!

---

స్కెచ్

# లాభసాటి దేశభక్తి

యం హీరాలాల్ రాయ్

పెద్ద సభచేశారు వూళ్ళో గొప్పవాళ్లు. ఆ సభలో, కొత్తకొత్తవాళ్లు దేశభక్తులుగా తమని ప్రదర్శించుకొన్నారు. ఆ బ్రహ్మాండమైన సభలో రాయలసీమ క్షామబాధితులకు సహాయపడడంకోసం విరివిగా చందాలు వసూలుచేసే కార్యక్రమంలో వున్నారు కొత్తవాళ్లు వూరికి పరిచయంగల పాత కార్యకర్తల కంఠాలు నిశ్శబ్దంగానే ఉన్నాయి కాని, ఈ కొత్త దేశభక్తులుమాత్రం క్షామ బాధితుల్నిగూర్చి తాము చూచివచ్చినట్టే చెబుతున్నారు. వినేవాళ్లు ఏమనుకుంటారంటే, ఈ కార్యకర్తలు అంత దూరానవున్న రాయలసీమకు వెళ్ళి, అక్కడి ప్రజల కడగండ్లన్నీ చూచి, దయగలిగి తిరిగి వచ్చి, తమనుండి విరివిగా సహాయం పుచ్చుకుని అక్కడి ప్రజలకు సహాయం చేయడానికి మళ్ళీ వెడతారని. ఆ ధోరణిలో ఉపన్యాసాలు